సాక్షి పెద్దపల్లి

బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



పోలీస్‌స్టేషన్ సందర్శన

ఎలిగేడు: పాత తహసీల్దార్ కార్యాలయ భవనంలో ప్రారంభానికి సిద్ధం చేసిన కొత్త పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ కరుణాకర్, ఏసీపీ కృష్ణ సందర్శించారు. త్వరలోనే ఠాణా ప్రారంభిస్తామన్నారు.



అంజన్న భక్తులకు నిత్యాన్నదానం

బస్టాండ్ సమీపంలోని హనుమాన్ ఆలయంలో అంజన్న మాల ధరించిన భక్తులకు నిత్యాన్నదానం చేస్తున్నారు. భక్తుల ఆకలి తీర్చేందుకే ఈ కార్యం చేపట్టారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

గరిష్ఠం/కనిష్ఠం
36.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం తగ్గి ఉక్కపోతగా ఉంటుంది. ఉదయం, రాత్రివేళ చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘ఆపరేషన్ కగార్’ను ఆపేయండి : ప్రజాసంఘాలు



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

పెద్దపల్లిరూరల్: ఆపరేషన్ కగార్ పేరిట దండకారణ్యంలోని ఆదివాసీలపై సాగిస్తున్న దమనకాండను వెంటనే ఆపేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట మంగళవారం సంఘీభావ పోరాట వేదిక కన్వీనర్ ముడిమడుగుల మల్లన్న, జిన్నం ప్రసాద్, గుమ్మడి కొమురయ్య తదితరుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రూ.కోట్ల విలువైన సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈక్రమంలోనే ఆదివాసీలపై దాడులు చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ దమనకాండను నిరసిస్తూ ఈనెల 20న కరీంనగర్‌లో చేపట్టిన ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. నాయకులు తాళ్లపల్లి లక్ష్మణ్, రామిళ్ల బాపు, శ్రీపతి రాజగోపాల్, శ్రీనివాస్, వెంకన్న, బాపన్న, సదానందం, గాండ్ల మల్లేశం, రాజు, ఎరుకల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా ఉండాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో కాళిందిని

సుల్తానాబాద్(పెద్దపల్లి): విద్యార్థుల యూనిఫామ్స్‌ను నాణ్యంగా కుట్టాలని డీఆర్డీవో కాళిందిని సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో కొనసాగుతున్న కుట్టు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో విద్యార్థుల యూనిఫామ్ స్టిచ్చింగ్ పనులు అప్పగిస్తున్నామని, ఇందుకోసం ఆసక్తిగలవారికి శిక్షణ ఇప్పిస్తున్నామని వివరించారు. ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, ట్రెయినర్ వసుంధర పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇల్లు సిద్ధం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మోడల్ ఇల్లు

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం వెనకాల చేపట్టిన మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ఇటీవల పూర్తయ్యింది. దీంతో మంగళవారం రంగులు వేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. లబ్ధిదారులు ఈ ఇంటిని చూసి తమ ఇళ్లను ఇలాగే నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

8వ డాన్‌గా కరాటే మొండయ్య



సర్టిఫికెట్ అందుకుంటున్న కరాటే మొండయ్య

గోదావరిఖనిటౌన్: సికింద్రాబాద్‌లో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా కరాటే సీనియర్ గ్రేడింగ్ టెస్టులో గోదావరిఖనికి చెందిన కరాటే మొండయ్య 7వ డాన్ నుంచి ఎనిమిదో డాన్‌కు ప్రమోట్ అయ్యారు. దేశవ్యాప్తంగా పేరొందిన 10మంది డాన్‌లు ఈ టెస్టులో పాల్గొన్నారు. ఇందులో ఏడుగురికి ప్రమోట్ అవకాశం దక్కిందని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ విజేతలను అభినందించారు. అనంతరం 10వ డాన్ శ్రీనివాసన్ బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

పెద్దపల్లిరూరల్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని డీసీపీ కరుణాకర్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ గజ్జి కృష్ణతో కలిసి మంగళవారం రౌడీషీటర్లతో సమావేశమై పలు సూచనలిచ్చారు. క్రిమినల్ కేసులు, భూదందాల్లో తలదూరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇతరుల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలకు గురికావాల్సి ఉంటుందని ఆయన అన్నారు. సమావేశంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు లక్ష్మణ్‌రావు, మల్లేశం, లక్ష్మణ్, స్వామి పాల్గొన్నారు.

కోనోకార్పస్



గోదావరిఖని జీఎం ఆఫీసు మూలమలుపు రాజీవ్‌రహదారిపై ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

> హరితహారం ద్వారా ఇప్పటివరకు సుమారు 200 కోట్లకుపైగా మొక్కలు నాటారు.. అందులో కోనోకార్పస్ మొక్కలు కూడా ఉన్నాయి.. ఇవి పర్యావరణానికి హానికరంగా మారాయి. వీటికి నీళ్ల అవసరం లేదు. చెట్లపై పిట్ట కూడా వాలదు.. ఆక్సిజన్‌ను పీల్చుకుని.. కార్బన్ డైయాక్సైడ్‌ను విడుదల చేస్తాయి.. ఇలాంటి చెట్లను వెంటనే తొలగించాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నాం.
>
> – శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అసెంబ్లీలో చేసిన ప్రకటన ఇది.

- పిట్టలు వాలవు.. పశువులు తినవు
- మనుషులకూ శ్వాసకోశ వ్యాధులు
- హరితహారంలో భారీగా నాటిన వైనం
- వేర్లతో సహా చెట్లు తొలగించాలని జిల్లావాసుల డిమాండ్

సాక్షి, పెద్దపల్లి: పశువులు తినవు.. పక్షులు వాలవు.. కీటకాలు దరిచేరవు.. మనుషులకు శ్వాసకోశ సంబంధిత సమస్యలు.. భూగర్భ జలాలను పీల్చిపిప్పిచేస్తాయి.. డ్రైనేజీలు, పైప్‌లైన్లు.. కేబుళ్లను చీల్చి వేస్తాయి.. ఏ రకంగా చూసినా నిష్ప్రయోజనమే.. ఇలాంటి కోనోకార్పస్ మొక్కలను హరితహారం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఇబ్బడిముబ్బడిగా నాటేశారు. పల్లె, పట్నమనే తేడా లేకుండా.. పార్కులు.. రోడ్లు.. డివైడర్లు.. వెంచర్లు.. ఇలా ఎక్కడ చూసినా విషపు కోనోకార్పస్ చెట్లు దర్శనమిస్తున్నాయి. ప్రతికూల ప్రభావాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 2022 జూన్ 15న కోనోకార్పస్ మొక్కలు నాటడం, పెంపకంపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కూడా హరితహారంలో ఈ మొక్కలు నాటొద్దంటూ ఆదేశాలు ఇచ్చాయి. కొత్తవి నాటకపోయినా.. ఇప్పటికే నాటిన వాటిని తొలగించకపోవడంపై జిల్లావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విదేశాల నుంచి దిగుమతి

సముద్రతీరంలో పెరిగే మంగ్రూవ్ జాతి(కోనోకార్పస్) మొక్క తక్కువ సమయంలోనే ఏపుగా పెరుగుతుంది. పచ్చదనంతో ఆకర్షిస్తుంది. గల్ఫ్ దేశాలు ఇసుక తుపానుల నుంచి రక్షణకోసం వీటిని భారీగా పెంచాయి. వాటిని చూసిన మనవాళ్లు దిగుమతి చేసుకుని విరివిరిగా నాటారు. ఈ మొక్కలతో కలిగే సమస్యలను గుర్తించిన ప్రపంచ దేశాలు.. వాటిపై నిషేధం విధించాయి. అప్పటికే నాటిన వాటిని తొలగించాయి. మనదేశంలో నిషేధం విధించినా నాటిన మొక్కలను తొలగించడంపై యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఇంకా దృష్టి సారించడం లేదు.

దేశీయ మొక్కలు నాటాలి



మానవాళికి, పక్షులకు ప్రమాదకరంగా మారిన కోనోకార్పస్ మొక్కలను తొలగించి, వాటి స్థానంలో ఆక్సిజన్ విడుదల చేసే దేశీయ మొక్కలను నాటాలి. తద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా, ఆరోగ్యకరమైన జీవవైవిధ్యాన్ని పెంపొందించవచ్చు. గోదావరిఖనిని పొల్యూషన్ బారినుంచి కాపాడుకోవడమే కాకుండా సుందరీకరణకు అవకాశం ఉంటుంది.

– పిట్టల రాజ్‌కుమార్, మదర్ హ్యూమన్ యూత్ సొసైటీ అధ్యక్షుడు

ఉపయోగం లేదు



అందం, ఆకర్షణ తప్ప కోనోకార్పస్ మొక్కలతో ఎలాంటి ఉపయోగం లేదు. మానవాళికి విషంగా తయారైన కోనోకార్పస్ మొక్కలను అధికారులు తొలగించాలి. వీటి ఆకులను పశువులు సైతం తినవు. డివైడర్లపై ఎక్కడ చూసినా ఇవే దర్శనమిస్తున్నాయి. నిత్యం ప్రజలు సంచరించే ప్రాంతాల్లో ఉన్న మొక్కలను తొలగించి దేశీయ మొక్కలను పెంచాలి.

– సూర్య శ్యాం, సుల్తానాబాద్

ప్రజారోగ్యంపై ప్రభావం



కోనోకార్పస్ మొక్కలు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఆకుల నుంచి వెలువడే పరాగ రేణువులతో ప్రమాదకర అలర్జీ వస్తుంది. ఆస్తమా అధికం అవుతుంది. ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు గురవుతాం. టీబీ పేషెంట్లకు ఇవి అత్యంత ప్రమాదకరం. ప్రపంచ దేశాలు తొలుత ప్రోత్సహించినా.. అనర్థాలు వెలుగులోకి రావడంతో ఈ మొక్కలను నిషేధించాయి.

– డాక్టర్ పిల్లి కిరణ్, సాయిల్ సైంటిస్ట్, కృషి విజ్ఞాన కేంద్రం

లీకేజీ.. ఈ పరేషాన్ ఏమిటి?



దుర్గానగర్ బోర్డు ఎదుట రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

- ఇప్పటికే అనేకసార్లు మరమ్మతు
- అయినా, తరచూ పైప్‌లైన్ ధ్వంసం
- రహదారిపై వృథాగా పోతున్న తాగునీరు
- పట్టని బల్దియా అధికార యంత్రాంగం

కోల్‌సిటీ(రామగుండం): అభివృద్ధి పనుల విషయంలో పారదర్శకత లోపిస్తుందడానికి ఈ చిత్రమే సాక్ష్యంగా నిలుస్తోంది. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని దుర్గానగర్ కాలనీ బోర్డు ఎదుట.. ప్రధాన రహదారిపై మంగళవారం వాటర్ పైప్‌లైన్ లీక్ అయ్యింది. తాగునీరు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి చేరింది. తాగునీరంతా వృథాగా పోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒకసారి కాదు..

ఈ ప్రాంతంలో పైపులైన్ మంగళవారం ఒక్కరోజే లీక్‌కాలేదు. ఇదేచోట ఇప్పటికే అనేకసార్లు పైప్‌లైన్ లీకైంది. ప్రైవేట్ వ్యక్తులతో అనేకసార్లు మరమ్మతు చేశారు. ఇందుకోసం నిధులు ఖర్చు చేస్తున్నా.. లీకేజీ ఆగడం లేదు. నెల క్రితం ఇదేప్రాంతంలో అధికారులు మరమ్మతు చేయించారు. మంగళవారం మరోసారి లీకేజీ ఏర్పడింది. 250 డయా సామర్థ్యం కలిగిన వాటర్ పైప్‌లైన్‌కు అమర్చిన జాయింట్ వద్దే తరచూ లీకేజీ సమస్యలు ఏర్పడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపమా? లేక సాంకేతిక పద్ధతిలో మరమ్మతు చేపట్టడం లేదా? లేదా మరమ్మతుల్లో నాసిరకం సామగ్రి వినియోగిస్తున్నారా? అనే సందేహాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో అనేక కాలనీల్లో మరమ్మతులు చేసిన ప్రాంతంలోనే వాటర్ పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడుతున్నాయి. లీకేజీలతో రోడ్లు డ్యామేజీ కావడంతోపాటు సమీప నివాసాలకు కలుషితమైన తాగునీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని నగరవాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో గైనిక్ సేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సోని

మంథని: స్థానిక మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్త్రీ వైద్య నిపుణురాలు ఆధ్వర్యంలో గైనిక్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత డిసెంబర్‌లో ఇక్కడి స్త్రీ వైద్య నిపుణురాలు రెగ్యులర్ జాబ్‌కు వెళ్లడంతో ఎంసీహెచ్‌లో ఆ సేవలు నిలిచిపోయాయి. స్త్రీవైద్య నిపుణులు లేక సుమారు మూడు నెలలుగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో స్త్రీవైద్య నిపుణురాలుగా సోనిని నియమిస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఆస్పత్రిలో గైనిక్ సేవలు మళ్లీ ప్రారంభమయ్యాయి. మహిళా పేషెంట్లకు మెరుగైన సేవలు అందిస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కొందరి కోసమే వంతెన నిర్మాణం



మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: బంధువర్గ ప్రయోజనాల కోసమే గోదావరి నదిపై వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. పట్టణ సమీపంలోని గోదావరి నదీతీరంలో బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదిత ప్రదేశంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల జిల్లా శివ్వారం నుంచి మంథని మధ్య గల గోదావరి నదిపై నిర్మించే వంతెనతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కూచిరాజ్‌పల్లి సమీపంలో 50 ఎకరాలు ఉన్నాయని, రియల్ ఎస్టేట్‌లో వాటి ధరలు పెంచేందుకే బ్రిడ్జి నిర్మాణం చేపట్టారని ఆయన ఆరోపించారు. నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, కనవేన శ్రీనివాస్, రవీందర్, శేఖర్ ఉన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



మాట్లాడుతున్న సాహితీవేత్త దాస్యం లక్ష్మయ్య

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ట్రినిటి డిగ్రీ కాలేజీలో మంగళవారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఉదయ సాహితీ, జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సమ్మేళనం నిర్వహించారు. ఉదయ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య మాట్లాడారు. మానవ విలువలను ప్రతిబింబింపజేసే సాహితీవేత్తలు జిల్లాలో అనేక మంది ఉన్నారన్నారు. మనిషి నడవడి, సంస్కృతి, సంప్రదాయాలను వివరించే ఆలోచన, అభ్యుదయ విలువలను పంచే సత్తా సాహిత్యానికే ఉందని అన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన కవులు, రచయితలు కవితాగానంతో అలరింపజేశారు. జిల్లా రచయితల సంఘం కన్వీనర్ ఏలేశ్వరం వెంకటేశం, కో కన్వీనర్ బుర్ర తిరుపతితోపాటు అనాసి జ్యోతి, బొమ్మిదేని రాజేశ్వరి, కొమురయ్య, కుమారస్వామి, రాజేశం, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేటలోని నిజాం కాలంనాటి చేదబావి



చేదబావి.. నేటికీ కళకళలాడి..

జూలపల్లి(పెద్దపల్లి): నిజాం కాలంలో తవ్వించిన చేదబావులు మండు వేసవిలోనూ నీటితో కళకళలాడుతున్నాయి. దాదాపు 80 ఏళ్ల క్రితం తవ్వించిన బావులు నేటికీ పల్లెవాసుల దాహం తీర్చడంలో కీలకంగా ఉంటున్నాయి. బండరాయితో గుండ్రంగా కట్టించిన బావుల గోడలు నేటికి చెక్కు చెదరలేదు. గ్రామీణులు వీటికి మోటార్లు బిగించుకొని ప్రస్తుతం నీటిని తోడుకుంటున్నారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నా.. అవసరాలకు సరిపోవడం లేదని, నిజాం కాలం నాటి చేదబావులే ఆదుకుంటున్నాయని అంటున్నారు.

ఉపరితల గనులే కీలకం

- 10 ఓసీపీల్లో వందశాతం బొగ్గు ఉత్పత్తి
- నిర్దేశిత లక్ష్యం సాధించిన ఐదు భూగర్భ గనులు

బొగ్గు ఉత్పత్తి (మిలియన్ టన్నుల్లో)

గని	లక్ష్యం	సాధించింది
ఓసీపీలు	65.90	64.19
భూగర్భగనులు	6.10	4.81
మొత్తం	72.00	69.00



డంపర్‌లో బొగ్గు లోడ్ చేస్తున్న షావల్

గోదావరిఖని: సింగరేణి సంస్థ వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు(ఓసీపీ)లు ఈ సారి కూడా కీలకపాత్ర పోషించాయి. సంస్థలోని పది ఓసీపీలు వందశాతం ఉత్పత్తి నమోదు చేయగా.. మరికొన్ని లక్ష్యానికి చేరువలో నిలిచాయి. నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో ఓసీపీలు సింహ భాగంలో నిలవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నాయి.

భూగర్భ గనుల్లోనూ వందశాతం..

ఈసారి వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో ఐదు భూగర్భగనులు కూడా వందశాతం బొగ్గు ఉత్పత్తి సాధించి కార్మికులు, సంస్థలో ఆశలు రేకెత్తించాయి. ఓసీపీల ద్వారా 65.90 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తీయాలని లక్ష్యంగా నిర్ణయించగా, 64.19 మిలియన్ టన్నులు సాధించాయి. భూగర్భగనుల ద్వారా 6.10 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా 4.80 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాయి. వందశాతం ఉత్పత్తి లక్ష్య సాధనలో ఓసీపీలు అగ్రభాగాన నిలవగా, భూగర్భగనులు వెనుకపడ్డాయి. వార్షిక నిర్దేశిత లక్ష్యం 72 మిలియన్ టన్నులు కాగా అందులో 64మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి ఓసీపీల ద్వారానే సాధించడం గమనార్హం.

వందశాతం లక్ష్యం సాధించిన ఓసీపీలు

సంస్థ వ్యాప్తంగా 11 ఓసీపీలు వార్షిక లక్ష్యం సాధించాయి. ఇందులో జీవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, ఖైరిగూడ ఓసీ, కోయగూడెం ఓసీ-2, జేకే-5ఓసీ, పీకే ఓసీ-4, మణుగూరు ఓసీ, ఓసీపీ-3, జీడీకే-5 ఓసీపీ, ఓసీపీ-1, ఓసీపీ-2 గనులు ఉన్నాయి.

భూగర్భగనులు ఇవే..

వందశాతం బొగ్గు ఉత్పత్తి క్ష్యం సాధించిన భూగర్భగనులు ఐదు ఉన్నాయి. వాటిలో జీడీకే-11, ఆర్కే-6, ఆర్కే న్యూటెక్, ఎస్ఆర్‌పీ-1గని, ఎస్ఆర్‌పీ-3, 3ఏగనులు ఉన్నాయి. భూగర్భగనులు లక్ష్య సాధనలో అగ్రభాగాన నిలవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఆర్థిక సంఘం గ్రాంట్స్‌కు అర్హత

- 72.50 శాతం ఆస్తిపన్ను వసూలుతో ఘనత
- గతేడాది కన్నా మెరుగైన ఆర్థిక పరిస్థితి



రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్‌కు అర్హత సాధించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 72.50శాతం ఆస్తిపన్ను వసూలు చేసి ఈఘనత సొంతం చేసుకుంది. నిర్దేశిత 100 శాతం ఆస్తిపన్ను వసూలు చేయకపోయినా.. గతేడాదితో పోల్చితే ఈసారి పనితీరు మెరుగుపర్చుకుంది. గతేడాది మార్చి 31 నాటికి 55.58 శాతం ఆస్తిపన్ను వసూలు కాగా, ఈఏడాది 72.50 శాతం వరకు నమోదు చేయడం గమనార్హం. నగరపాలక సంస్థ స్పెషలాఫీసర్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష.. కమిషనర్(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ ప్రత్యేక దృష్టి సారించడంతో ఫలితం దక్కిందని అధికారులు అంటున్నారు.

డిమాండ్ రూ.14.76 లక్షలు

బల్దియాలో ఆస్తిపన్ను రూ.14.76 లక్షల డిమాండ్ ఉండగా, ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు రూ.10.70లక్షల వరకు వసూలుచేసి 72.50 శాతం నమోదు చేయగలిగింది. గతేడాది 55.58శాతమే ఆస్తిపన్ను వసూలు చేసింది. గత ఐదేళ్ల స్థూల ఉత్పత్తి సగటు 12.09 శాతానికి మించి ఈసారి ఆస్తిపన్ను వసూలు కావడంతో రామగుండం బల్దియా 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్ పొందడానికి అర్హత సాధించినట్లయ్యింది.

వసూళ్లలో వార్డు ఆఫీసర్లు..

గ్రూప్–4 నియామకాలు పూర్తికావడంతో కొందరు ఉద్యోగులు వార్డు అధికారులుగా ఇటీవల విధుల్లో చేరారు. రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన మరికొందరు సిబ్బంది అందుబాటులో ఉన్నారు. దీంతో బల్దియా కమిషనర్ అరుణశ్రీ.. రెండు నెలల క్రితం ఓ మంచినిర్ణయం తీసుకున్నారు. అంతకుముందు నగరంలోని నివాసాలన్నీ 22 రెవెన్యూ బ్లాకుల్లో భాగమై ఉండేవి. ఒక్కో బ్లాక్‌కు ఒక బిల్ కలెక్టరే ఆస్తిపన్ను వసూలు చేసేవారు. కమిషనర్ నిర్ణయంతో ఎలక్షన్ డివిజన్ల ప్రాతిపదికన 50 డివిజన్లుగా విభజించారు. అందుబాటులో ఉన్న సిబ్బందికి తోడు కొత్తగా నియామకమైన వారికి ఆస్తిపన్ను వసూలు విధులు కేటాయించారు. ఇలా ఒక్కో డివిజన్‌కు ఒకరు చొప్పున 50 డివిజన్లకు మొత్తం 50 మందిని వార్డు ఆఫీసర్లుగా నియమించారు. వారికి సహాయకులుగా కార్యాలయంలో అదనంగా ఉన్న సిబ్బందిని నియమించారు. ఉదయం 8 గంటల నుంచే ఆస్తిపన్ను వసూళ్ల పురోగతిపై కమిషనర్ సమీక్షిస్తుండడంతో సత్ఫాలితాలు వచ్చాయి.

ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదుల స్వీకరణ

- సిటిజన్ బడ్డీ యాప్‌లో నమోదు చేయండి
- కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): పౌర సేవలపై ఫిర్యాదు చేయడానికి ఇకనుంచి కార్యాలయానికి రావొద్దు.. ఆన్‌లైన్‌లో నేరుగా ఫిర్యాదు చేయండి.. ఇలా చేస్తే ఫిర్యాదు ఏ స్థితిలో ఉందో కూడా తెలుసుకునే అవకాశం ఉంది.. ఇందుకోసం సిటిజన్ బడ్డీ యాప్‌ను ఉపయోగించుకోవాలి’ అని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ కోరారు. స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు ప్లేస్టోర్ నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ‘సిటిజన్ బడ్డీ యాప్’ను డౌన్‌లోడ్ చేసుకొని ఫిర్యాదు చేయాలని తెలిపారు. వెబ్‌సైట్ htpp://egovindia.inలోని గ్రీవెన్స్ పేజీలో కూడా ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చన్నారు. టోల్‌ఫ్రీ నంబరు 14420కు ఫోన్‌చేసి ఫిర్యాదు ఇవ్వొచ్చని వివరించారు. అదేవిధంగా బల్దియా కార్యాలయంలోని కాల్‌సెంటర్‌లోని టోల్‌ఫ్రీ సెంటర్ 1800 4257062కు లేదా ఫోన్ నంబరు 96036 66444, 93924 83959 (కంట్రోల్ రూమ్)కు ఫోన్‌చేస్తే ఫిర్యాదు స్వీకరిస్తారని వివరించారు. పారిశుద్ధ్యం, రోడ్లు, కాలువలు, నీటి సరఫరా, వీధిదీపాలు తదితర సేవల్లో సమస్యలు ఉంటే ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి సిబ్బంది చర్యలు తీసుకుంటారని అన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన మున్సిపల్ సేవలు పొందాలని ఆమె కోరారు.



జైబోలో హనుమాన్‌కీ..

పెద్దపల్లిరూరల్: ‘జై శ్రీరాం.. జైబోలో హనుమాన్‌కీ..’ నినాదాలతో జిల్లా కేంద్రం మార్మోగింది. పట్టణమంతా కాషాయమయమైంది. పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద మంగళవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ విజయయాత్ర ప్రారంభించారు. పుర వీధుల గుండా యాత్ర కొనసాగింది. మినీట్యాంక్‌బండ్ వరకు కొనసాగిన యాత్రలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తలతోపాటు బీజేపీ, బీజేవైఎం తదితర అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమల్ కిశోర్ శారద, డీఆర్‌యూసీసీ సభ్యుడు ఎన్‌డీ తివారీ, బీకే జాకోటియా, జంగ చక్రధర్‌రెడ్డి, సతీశ్, భారీసంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీ కాలువలో గుర్తుతెలియని మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సుగల వ్యక్తి శరీరంపై బ్రౌన్ కలర్ ఫార్మల్ పాయింట్, మెరూన్, నలుపు రంగు పొడుగు గీతలు, ఫుల్ హ్యాండ్స్ చొక్క ఉందని రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని పేర్కొన్నారు.

వీవింగ్ మిల్లు కార్మికుడి మృతి


బోకం నాయుడు (ఫైల్)

రామగుండం: అంతర్గాం టీటీఎస్ కాలనీకి చెందిన వీవింగ్ మిల్లు కార్మికుడు బోకం నాయుడు (60) మంగళవారం మృతి చెందాడు. వీవింగ్ మిల్లు నుంచి ప్రయోజనాలకు సంబంధించిన బకాయిలు రావాల్సి ఉంది. ఆ సొమ్ము చూడకుండానే నాయకుడు మృతి చెందాడు. ఇప్పటికే పదుల సంఖ్యలో కార్మికులు బకాయిలు పొందకుండానే మృతి చెందారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తక్షణమే బకాయిలను చెల్లించాలని బర్మా, కాందీశీకుల సంఘం ప్రతినిధులు జమ్ముల రామారావు, ఇండిబిల్లి రవీందర్ కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో కౌలురైతు..


ప్రశాంత్ (ఫైల్)

గంగాధర(చొప్పదండి): మండలంలోని కురిక్యాల గ్రామానికి చెందిన కౌలురైతు ఒగ్గరి ప్రశాంత్(38) విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ప్రశాంత్ గ్రామంలోనే మూడెకరాల వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని వరి పంటసాగు చేస్తున్నాడు. మంగళవారం వేకువజామున కరెంట్ మోటార్ పెట్టేందుకు పొలం వద్దకు వెళ్లాడు. ఫీజులు, స్టార్టర్ డబ్బా కాలిపోయి విద్యుత్ వైర్లు విడిపోయి ఉన్నాయి. విషయం తెలియక మోటార్ ఆన్ చేసేందుకు బాక్స్ ముట్టుకోగానే విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

ధర్మపురి: అతి వేగంగా.. అజాగ్రత్తగా కారు నడిపి ఓ యువకుడి మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని తుమ్మెనాల గ్రామానికి చెందిన తొందుర్తి రాజేందర్ ధర్మపురిలోని వెంకటేశ్వర షాపులో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకుని ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ధర్మపురి సమీపంలోని నర్సయ్యపల్లి స్టేజీ వద్ద ధర్మపురి నుంచి జగిత్యాల వైపునకు వెళ్తున్న కారు డ్రైవర్, మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గుడిరేవుకు చెందిన తమ్ముడి వినోద్ అజాగ్రత్తగా కారు నడిపి ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాజేందర్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గంగరాజు ఫిర్యాదు మేరకు దీంతో డ్రైవర్ వినోద్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

అయ్యా.. 'చేయూత' ఏదయా

- మార్చి నెల దాటినా ఖాతాకు పింఛన్ చేరలే
- వృద్ధులు, దివ్యాంగుల పడిగాపులు
- కొత్త అర్జీలకు కలగని మోక్షం



కరీంనగర్ అర్బన్: ప్రతి నెలా ఠంచన్‌గా రావాల్సిన చేయూత పింఛన్ నెల దాటినా దిక్కులేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ప్రతి నెలా తొలివారంలోనే డబ్బులొచ్చేవి. క్రమేణా నెలాఖరుకు చేరగా తాజాగా నెల దాటినా పింఛన్ అలజడి లేకపోవడం ఆందోళనకర పరిణామం. పింఛన్‌పైనే ఆధారపడి జీవించే వృద్ధులు లేకపోలేదు. ఎప్పుడొస్తాయోనని ఎదురుచూసేవారు వేలల్లో ఉండగా పడిగాపులు అనివార్యమయ్యాయి. అధికారులను సంప్రదిస్తే డబ్బులు వస్తాయని చెబుతున్నారని, తీరా ఏప్రిల్ రావడంతో గందరగోళం నెలకొంది.

ఎందుకిలా..

జిల్లాలో ఆసరా పింఛన్ల కింద మొత్తం 1,23,041 మంది లబ్ధిపొందుతున్నారు. ప్రతి నెలా దివ్యాంగులకు రూ.4016, ఇతర పింఛన్లకు రూ.2016 చెల్లిస్తున్నారు. కాగా 6 నెలలుగా సకాలంలో పింఛను రాకపోవడంతో సంబంధిత కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. పింఛన్ కోసం బ్యాంకుకు వెళ్లడం రాలేదన్న సమాచారంతో నిరాశగా వెనుదిరగడం లబ్ధిదారుల వంతవుతోంది. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో?

లబ్ధిదారుల సంగతి అటుంచితే కొత్త దరఖాస్తులు, పాత దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పడం లేదు. నాలుగేళ్లుగా కొత్త పింఛన్లు లేకపోగా ఇప్పుడు అప్పుడంటూ ప్రభుత్వ ప్రకటనల క్రమంలో అర్జీలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతుండగా మంజూరు మాటే లేదు. దీంతో జిల్లావ్యాప్తంగా వేలమంది కొత్త పింఛన్ల కోసం నిరీక్షిస్తున్నారు. కొత్త పింఛన్లు ఇస్తామని సీఎం ప్రకటించగా నేటికి వాటి ఊసే లేదు. 57ఏళ్లు నిండినవారికి పింఛన్ ఇస్తామని గత ప్రభుత్వం వెసులుబాటు కల్పించగా వేలమంది దరఖాస్తు చేశారు. వాటి పరిశీలన ప్రక్రియ చేపట్టకపోగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో కొత్త పింఛన్లు సుమారు 20వేల వరకు వచ్చే అవకాశముండగా ఇంకా స్పష్టత లేకపోవడం ఆరోపణలకు తావిస్తోంది.

పెరగనున్న లబ్ధిదారులు

ఆసరా పింఛన్‌దారుల వయస్సు 57కు తగ్గించగా, గ్రామ, మండలస్థాయిలో పరిశీలించి జిల్లావ్యాప్తంగా 14వేలకు పైగా అర్హులు ఉన్నట్లు గుర్తించారు. దీనికితోడు కొత్త దరఖాస్తులు వేలల్లో ఉండగా అతీగతి లేదు. దివ్యాంగులకు రూ.4,016, ఇతర పింఛన్లకు రూ.2,016 చెల్లిస్తుండగా దరఖాస్తుల క్రమంలో పింఛన్లు చెల్లిస్తే లబ్ధిదారుల సంఖ్య 20వేలకు పైగా చేరుకోనుంది.

జిల్లాలో చేయూత మొత్తం లబ్ధిదారులు: 1,23,041
ఇందులో వృద్ధాప్య పింఛన్‌దారులు: 48,318
వితంతు: 34,229
దివ్యాంగులు: 20,702
గీతకార్మికులు: 3,767
చేనేత కార్మికులు: 2,817
ఒంటరి మహిళలు: 3,271
బీడీ కార్మికులు: 9,937

జిల్లాలో మండలాల వారీగా పింఛన్ తీసుకుంటున్నవారు..

మండలం	మొత్తం పింఛన్లు
చిగురుమామిడి	6,692
చొప్పదండి	7,527
ఇల్లందకుంట	4,574
గంగాధర	9,946
గన్నేరువరం	3,414
హుజూరాబాద్	6,352
హుజూరాబాద్‌అర్బన్	2,256
జమ్మికుంట	5,502
జమ్మికుంటఅర్బన్	2,599
కరీంనగర్‌రూరల్	5,458
కరీంనగర్‌అర్బన్	19,493
కొత్తపల్లి	6,512
మానకొండూర్	8,706
రామడుగు	8,281
సైదాపూర్	6,418
శంకరపట్నం	6,361
తిమ్మాపూర్	6,991
వీణవంక	5,959
మొత్తం	123,041

మందులకు పైసల్లేవు



ఎప్పుడైనా ప్రతి నెలా మొదటివారంలో పింఛన్ డబ్బులు వచ్చేవి. ఏమైందో కానీ కొన్ని నెలలుగా వచ్చే పింఛన్ అవసరానికి ఉపయోగపడటం లేదు. నెలాఖరుకు పింఛన్ వేస్తున్నారు. ఇప్పుడేమో అవీ దిక్కులేదు. ఇంకా మార్చి నెల డబ్బులు రాలే. ప్రతి నెల మందులు వాడాలి. ఇప్పుడేమో చేతిలో డబ్బులు లేవు.

– బి.మల్లారెడ్డి, హుజూరాబాద్

పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో..

- పూసాలకు చెందిన యువకుడి ఆత్మహత్య


లింగమూర్తి(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): తనకు వివాహం కావడం లేదనే మనస్తాపంతో పూసాల గ్రామానికి చెందిన నల్ల లింగమూర్తి(38) ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. లింగమూర్తి రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తాడు. ఐదేళ్లక్రితం తల్లిదండ్రులు చనిపోయారు. వీరు నలుగురు అన్నదమ్ములు. అందులో పెద్దన్న, మూడోఅన్నకు పెళ్లి అయ్యింది. లింగమూర్తి రెండో అన్నతో కలిసి ఉంటున్నాడు. ఈక్రమంలో తనకు పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో మార్చి 29న రాత్రి ఎలుకల మందు తాగాడు. మరుసటి తెల్లవారుజామున కడుపు నొప్పి తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి అన్న నల్ల రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

గొల్లపల్లి: అనారోగ్య కారణాలతో ఒకే రోజు ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్న ఘటన గొల్లపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం గొల్లపల్లికి చెందిన ఎనగందుల జయంతి(25)డిగ్రీ వరకు చదువుకుని ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటుంది. గత కొంత కాలంనుంచి కడుపు నొప్పితో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోని ఇనుప రాడ్డుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

బావిలోకి దూకి వృద్ధురాలు..

మండలంలోని గోవిందుపల్లి గ్రామానికి చెందిన బింగి వెంకటమ్మ(72)గత కొనేళ్లుగా థైరాయిడ్, షుగర్ తో బాధపడుతోంది. ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది, గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

- బంగారు నగలు, వాహనాలు స్వాధీనం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలో ఓ మహిళ ఇంట్లో చోరీకి పాల్పడి బంగారు, వెండి నగలు ఎత్తుకెళ్లిన కేసులో ఇద్దరు మైనర్ నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు బోయినపల్లి ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు. కొదురుపాక గ్రామంలో గతనెల 28న సట్ల జలజ అనే మహిళ కోడిగుడ్లు తీసుకరావడానికి ఇంటికి గడియ పెట్టి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోని బంగారు, వెండి నగలు ఎత్తుకెళ్లారన్నారు. ఈ విషయమై ఆమె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రెండు టీంలుగా ఏర్పడి టెక్నికల్ ఎవిడెన్స్, సీసీ ఫుటేజీల ఆధారంగా కరీంనగర్‌కు చెందిన ఇద్దరు మైనర్ యువకులతో పాటు ప్రవళిక, అంజయ్య అనే భార్యభర్తలను పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి నాలుగున్నర తులాల బంగారు నగలు, రెండు జతల వెండి పట్టగొలుసులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరి నుంచి రెండు బైక్‌లు, వెల్డింగ్ మిషన్ స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

దంపతుల ప్రోత్సాహంతో..

బైక్‌లు ఎత్తుకెళ్లడం లాంటి దొంగతనాలు చేసే కరీంనగర్‌కు చెందిన మైనర్ యువకులు ఆ వాహనాలను ప్రవళిక-అంజయ్య దంపతులకు కరీంనగర్‌లో విక్రయించేవారని పోలీసులు తెలిపారు. కాగా చిన్న దొంగతనాలు ఎన్ని రోజులు చేస్తారని పెద్ద దొంగతనాలు చేయాలని ప్రవళిక అంజయ్యలు ప్రోత్సహించడంతో బంగారు నగలు చోరీకి పాల్పడ్డట్లు పేర్కొన్నారు.

లాభాల బాటలో ఆర్‌ఎఫ్‌సీఎల్


ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం

- ఉత్పత్తి లక్ష్యం 12.74 లక్షల మెట్రిక్ టన్నులు
- సాధించింది 11,94,921.17 మెట్రిక్ టన్నులు
- వార్షికాదాయం అంచనా సుమారు రూ.510 కోట్లు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్) కర్మాగారం లాభాల బాటలో పయనిస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత 12.7 లక్షల మెట్రిక్ టన్నులకు 11,94,921.17 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసి సుమారు రూ.510 ఆదాయం సమకూర్చుకుంది. ప్లాంట్ సామర్థ్యం రోజూ 3,850 మెట్రిక్ టన్నుల యూరియా, 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తోంది.

ఏడు రాష్ట్రాలకు సరఫరా..

అర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి చేసిన యూరియాను తెలంగాణతోపాటు 7 రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. తెలంగాణకు 4,68,954.76 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 1,78,363.39 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 1,91,288.07 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 82,986.39 మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్‌కు 60,640.38 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 1,01,520.99మెట్రిక్ టన్నులు, మధ్యప్రదేశ్‌కు 1,11,167.19 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు.

లక్ష్యానికి దూరంగా ఉన్నా..

ఆర్‌ఎఫ్‌సీఎల్ 2024–25 ఆర్థిక సంవత్సరంలో 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేయాల్సి ఉంది. కానీ, 11,94,921.17 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేశారు. కర్మాగారంలో నెలకొన్న సాంకేతిక సమస్యలతో దాదాపు 75,078.83 మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా ఉత్పత్తి చేశారు. ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం చేరుకోలేకపోయినా.. లాభాలు ఆర్జిస్తోంది.

లాభాలు ఇలా..

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 22 మార్చి 2022లో నీమ్ కోటెడ్ యూ రియా ఉత్పత్తి ప్రారంభించారు. దీంతో 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.15.23 కోట్లు, 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.440.96 కోట్లు, 2024–25 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.510 కోట్ల ఆదాయం సాధించారు.





రాజన్నకు సెలవుల రద్దీ

వేములవాడ: ఎములాడ రాజన్నకు వరుస సెలవుల రద్దీ పెరిగింది. మంగళవారం 20 వేల మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బద్ది పోచమ్మకు బోనం, ఒడి బియ్యం, కల్లుసాక, సమర్పించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.



మార్కెట్ కమిటీలకు 'లక్ష్మీ' కటాక్షం

- ధాన్యం సేకరణతో రూ.20.69 కోట్ల ఆదాయం
- మొదటి స్థానంలో ధర్మపురి, చివరిస్థానంలో ఇబ్రహీంపట్నం


గ్రామాల్లోని కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు


జగిత్యాల మార్కెట్‌లో అమ్మకానికి తెచ్చిన పసుపు పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల పూర్తిగా వ్యవసాయాధారిత జిల్లా. సాగునీటి వనరులు పుష్కలంగా ఉండటంతో గతేడాది అన్ని పంటలు పుష్కలంగా పండాయి. రైతులతోపాటు మార్కెట్ కమిటీలకూ భారీగా ఆదాయం సమకూరింది. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీలు 2024–25 ఆర్థిక సంవత్సరంలో 'లక్ష్మీ' కటాక్షంతో కళకళలాడుతున్నాయి. జిల్లాలో లక్ష్యాన్ని మించి అత్యధికంగా ఆదాయం సంపాదించిన దాంట్లో మొదటి స్థానంలో ధర్మపురి మార్కెట్ నిలిచింది. చివరి స్థానంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ నిలిచింది.

జిల్లాలో 13 వ్యవసాయ మార్కెట్ కమిటీలు

జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, గొల్లపల్లి, ధర్మపురి, మల్యాల, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, పెగడపల్లి, వెల్గటూర్, రాయికల్ ఇలా మొత్తం 13 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ మార్కెట్ యార్డులకు రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. కొనుగోలు చేసిన వ్యాపారులు ఉత్పత్తుల విలువపై ఒక శాతం ఫీజును మార్కెట్ కమిటీలకు చెల్లిస్తుంటారు. గ్రామాల్లో నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసినా ఆ వ్యాపారులు కూడా సంబంధిత మార్కెట్‌కు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. వ్యాపారులే కాకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సివిల్ సప్లై, మార్క్‌ఫెడ్ వంటి సంస్థలు కూడా ఫీజు చెల్లిస్తుంటాయి. ఇటీవలి కాలంలో ప్రభుత్వ సంస్థలు రైతుల నుంచి ధాన్యం, మొక్కజొన్న, కందులు, మినుములు, శనగలు వంటివి కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్ ఫీజు చెల్లించడం కొంచెం ఆలస్యమైనా భారీగానే ఆదాయం వస్తోంది.

రికార్డు స్థాయిలో ఉత్పత్తితోనే ఆదాయం

జిల్లాలో ప్రతి సీజన్‌లో కనీసం 5 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తుంటారు. ఇందులో 3 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. వానాకాలం, యాసంగి సీజన్‌లోనే దాదాపు 10 నుంచి 12 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. మొక్కజొన్న కూడా రెండు సీజన్లలో కలిపి దాదాపు 5 నుంచి 6 లక్షల క్వింటాళ్లు దిగుబడి అవుతుంది. కందులు, పెసర్లు, అలిసంద, నువ్వులు, పత్తి, పసుపు వంటి ఉత్పత్తులు అమ్ముతుంటారు. కొన్నేళ్లుగా జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల మార్కెట్ కమిటీలకు మామిడి కాయల అమ్మకం ద్వారా మార్కెట్ ఫీజు బాగానే వస్తోంది. ఇతర జిల్లాల్లో రైతుల ఉత్పత్తులు కొనుగోలు చేసినప్పటికీ అక్కడ మార్కెట్ ఫీజు చెల్లించలేదంటే.. చెక్ పోస్టుల ద్వారా కూడా ఫీజు వసూలవుతుంది.

లక్ష్యాన్ని మించి ఆదాయం

ఐదేళ్లలో సాధించిన ఆదాయం ప్రకారం జిల్లాలోని మార్కెట్ కమిటీలకు ఏటా లక్ష్యాన్ని నిర్దేశిస్తుంటారు. జిల్లాలోని 13 మార్కెట్ కమిటీల్లో జగిత్యాల, ధర్మపురి, మల్యాల, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్, పెగడపల్లి, వెల్గటూర్, రాయికల్ మార్కెట్‌లు మాత్రమే లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని అర్జించాయి. జిల్లాలో రూ.15.98 కోట్ల లక్ష్యానికి రూ.20.69 కోట్ల ఆదాయాన్ని(129.47 శాతం)సాధించాయి. రాబోయే ఏడాదిలోనూ మంచి ఆదాయాన్ని సంపాదించేందుకు మార్కెట్ కమిటీలు ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

జిల్లాలోని మార్కెట్ కమిటీల లక్ష్యం, ఆదాయం (రూ.కోట్లలో..), శాతం

మార్కెట్ కమిటీ	లక్ష్యం	ఆదాయం	శాతం
జగిత్యాల	2.61	2.79	106.71
మెట్‌పల్లి	1.75	1.31	74.90
కోరుట్ల	1.47	1.01	68.80
గొల్లపల్లి	8.8	8.4	95.86
ధర్మపురి	1.81	4.86	267.45
మల్యాల	1.62	3.56	220.14
కథలాపూర్	1.05	1.25	119.76
మేడిపల్లి	9.3	11.6	124.37
మల్లాపూర్	7.0	8.3	105.01
ఇబ్రహీంపట్నం	4.6	3.4	74.19
పెగడపల్లి	7.5	8.4	111.74
వెల్గటూర్	1.12	1.12	100.52
రాయికల్	6.9	7.2	103.81
మొత్తం	15.98	20.69	129.47

మార్కెట్లలో వసతులు కల్పించాలి



జిల్లాలోని అన్ని మార్కెట్‌లలో సరైన వసతులు కల్పించాలి. రైతులకు విశ్రాంతి భవనాలు నిర్మించాలి. మంచి నీటి సదుపాయాలు, మూత్రశాలలు సరిగ్గా లేవు. రైతుల ఉత్పత్తుల అమ్మకం ద్వారా మార్కెట్‌లకు వచ్చే ఆదాయాన్ని అభివృద్ధికే ఖర్చు చేయాలి.

– వేముల కర్ణాకర్‌రెడ్డి, తీగలధర్మారం, ధర్మపురి మండలం

ఆదాయం సంపాదించాం




జిల్లాలోని అన్ని మార్కెట్లలో లక్ష్యాన్ని మించి 129.47 శాతంతో ఈ ఏడాది రూ 20.69 కోట్ల ఆదాయాన్ని సాధించాం. మార్కెట్ ఫీజును కచ్చితంగా వసూలు చేయడంతోనే అనుకున్న లక్ష్యాన్ని సాధించాం. ఈ మేరకు అయా మార్కెట్లలోని మార్కెట్ సిబ్బంది రాత్రిబవళ్లు పనిచేస్తున్నారు.

– ప్రకాశ్, మార్కెటింగ్ అధికారి, జగిత్యాల

'ఎల్లంపల్లి'లో తగ్గుతున్న నీటిమట్టం

- అప్రమత్తమైన హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు


ఎల్లంపల్లి ప్రాజెక్టులో సగానికి పడిపోయిన నీటిమట్టం

రామగుండం: పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం సగానికి పడిపోయింది. దీంతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్, సీవరేజీ బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్) అధికారులు అప్రమత్తమయ్యారు. వచ్చే మే చివరి నాటికి ప్రాజెక్టు అడుగంటిపోయే ప్రమాదం ఉంది. తద్వారా హైదరాబాద్‌కు తాగునీరు పంపింగ్ చేసే విద్యుత్ మోటార్లకు సరిపడా నీరు అందకుండా పోతుందని భావించిన అధికారులు.. ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

హైదరాబాద్‌కు రోజూ సరఫరా..

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ మహా నగరానికి రోజూ తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లిలో పంపుహౌస్ నిర్మించారు. ఒక్కోటి 6.6 కేవీ సామర్థ్యం గల ఆరు విద్యుత్ మోటార్లతో రోజూ సుమారు 56 క్యూసెక్కులను హైదరాబాద్‌కు పంపింగ్ చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 148 మీటర్లు. 138.3 మీటర్ల స్థాయికి నీటిమట్టం పడిపోతే పంపుహౌస్‌లోని విద్యుత్ మోటార్లకు నీరు అందకుండా పోతోంది. తద్వారా పంపింగ్ నిలిచిపోతుంది.

నీటిమట్టం 143.47 మీటర్లు

నీటిపారుదలశాఖ శాఖ అధికారులు మంగళవారం వెలడించిన వివరాల ప్రకారం.. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా ప్రస్తుతం 143.47 మీటర్లు ఉంది. 9.75 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదేరోజు 142.28 మీటర్ల నీటిమట్టం ఉంటే 7.84 టీఎంసీల నిల్వ ఉంది. దీంతో గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ అధికారులు.. నీటిని ఎత్తిపోసేందుకు 125 హెచ్‌పీ సామర్థ్యం గల 25 మోటార్లను సిద్ధం చేస్తున్నారు.

సమీక్షిస్తున్నాం

ఎల్లంపల్లి ప్రాజెక్టులో గతేడాదితో పోల్చితే ప్రస్తుతం నీటిమట్టం ఆశాజనకంగానే ఉంది. 138.3 మీటర్లకు నీటిమట్టం పడిపోతేనే పంపింగ్ కోసం ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 143.47 మీటర్లు ఉంది. హైదరాబాద్ వాసులకు తాగునీటి సమస్య రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు అధికారులతో సమీక్షిస్తున్నాం.

– వెంకటేశ్, డీజీఎం, హెచ్‌ఎండబ్ల్యూఎస్

గంజాయి విక్రేత అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో మంగళవారం సాయంత్రం సీసీఎస్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. అంతర్గాం గ్రామానికి చెందిన నాగిశెట్టి స్వామి అలియాస్ సన్ని ఇంట్లో తనిఖీలు చేపట్టగా.. 130 గ్రాముల గంజాయి లభ్యమైంది. ఆ గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రూరల్ పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.